# "అదృష్టరేఖ"

శ్రీ వన్యాల వేంకటరంగనాధరావు.

ప్రొద్దుట్నుంచి యిప్పటిదాకా కాళ్లరిగిపోయేటట్లు తిరుగుతున్నాడు. ఏమైనా పని దొరుకుతుందేమోనని పాపం సూర్యం; కాని, యెప్పుడూ లేంది ఆనాడు మాత్రం పని దొరుకుతుందని తెకానా యేమిటి? ఇల్లాంటి బియ్యేలు లోకంలో యిప్పుడు యెందరీ రీతిగా వున్నారో? అంతమందిలో యీతడు ఒకి లెఖా!

ఎన్నడూ తను చూడని ధానాడు ఆ మర్రిచెట్టుకింద చాలామంది జనం మూగివున్నారు. పనీపాటూ లేకుండా వూరికే రోడ్లంట తిరిగేవారికేమున్నా వింతకనబడితే అదేదో కనుక్కొనేదాకా తొందరగా వుంటుంది. గబగబా జనాన్ని త్రోసుకొంటూ లోనికిదూరేడు సూర్యం. అక్కడో చిన్న పలకమీద చేయిచూసి మీజీవితఫలాల్ని చెప్పటకు రెండు బేడలు మాత్రమే...' అనివుంది. ఆ పలకముందు ఒక ముసలాయన- పెద్దబొట్టు- పిండికట్లు-గిరదాలు మీసాలు- తట్ట తలపాగా- ఈ వేషంలో కూర్చున్నాడు. తన కేమున్నా అదృష్టంవుందా? అదేదో కనుక్కోవాలన్న కుతూహలం కలిగింది. జేబు తడిమేడు. పన్నెండణాల కన్నా యెక్కువలేవు. ఇప్పుడు దీనిక్రింద ఒక పావలా డబ్బులు ఖర్చెడితే- రాత్రి పస్తు పడుక్కోవాలో యేమో?- కానీ యేమైతే అయిందని.---

'నాకొంచెం చూస్తారా' అన్నాడు.

'ఓ,అంతకన్నానా-దయచెయ్యండి బాబూ, దయచెయ్యండి' అన్నాడా జ్యోతిష్కుడు.

సూర్యం కూర్చుని తన కుడిచేయి అందించేడు. ఆ జ్యోతిష్కుడు తీవ్రంగా చూసేడు సూర్యం చేతిని. ఏమేమో అనేక భావాలను వెలిబుచ్చేడు. ఓ మారు చిరునవ్వు- ఓమారు ఆశ్చర్యం- ఓమారు విచారసూచకం- ఓ మారం దేదో బాధపడినట్టు- ఇలా వూహిస్తూ, బుర్ర తెట పటాయిస్తున్నాడు. సూర్యానికిదేమీ బోధపడటంలేదు. కొంపతీసి యేమన్నా చెడుగు చెప్తాడా యేమి చెప్తా! చచ్చిపోయాం...ఎల్లాగ? ముందు చేయిచ్చేశాను. ఇప్పుడు జంకుతే లాభం ఏమిటి? రోలులో తలపెట్టి రోకటి పోటుకి జడవటం దేనికి?...కానీ, యేమైతే అయింది. భగవంతుడే వున్నాడనుకొన్నాడు.

ఆలోచించాలోచించి జ్యోతిష్కుడిల్లా అన్నాడు:

'కొద్ది రోజుల్లో మీకు గొప్ప అదృష్టం పట్టబోతున్నదండి.'

ఇన్నాళ్లూ లేంది ఇప్పు డదృష్టమా? చిరునవ్వులో దుఃఖ సూచకం సూర్యం ముఖాన వ్యాపించింది.

'ఎల్లాంటి అదృష్టం' అన్నాడు.

'ధనంలో అదృష్టం' అన్నాడు జ్యోతిష్కుడు.

'ఏమో సరుగా' అన్నాడు సూర్యం,

'ఒక లాటరీ మూలంగా మీకు చాలా ధనప్రాప్తి వుందండి కాని... కాని...' అనేమో చెప్పబోతున్నాడు.

కానీ- అర్ధణా యేమిటి?... గాభరా వేసింది సూర్యానికి.

'కానీ యేమిటి——'

'అబ్బే మరేమీ లేదండి ఆ ధనప్రాప్తి చాలా కొద్దిరోజుల్లోనేవుంది ...కాని...కాని...'

ఏదేదో చెప్పటానికి సందేహిస్తూన్నట్టుంది. కొంపతీసి చెడుగు చెప్ప దలచుకొన్నాడేమో! పోతే పోయింది పావలా అని...

'అరరే- నాకు చాలా తొందరవనుంది, మరచిపోయాను' అంటూ

పావలా యిచ్చేసి లేచి వెళ్లిపోయాడు సూర్యం...బ్రతుకు జీవుడా అని.

అదృష్టం! ...అదృష్టం...లాటరీ మూలంగా డబ్బొస్తుందట...ఇది నమ్మడమెల్లాగ! తానేమన్నా లాటరీ టిక్కెట్లు కొన్నాడా!... అదీలేదు. ఇక ముందు కొంటాడా! ఒక్కొక్క టిక్కెట్టు రూపాయిల బేరంలో వుంటుందే!...తన దగ్గరున్నది. ఓ అర్ధరూపాయి!...ఏమో! ఏసమయానికేమవుతుందో!...

సూర్యం ఇంటి ముఖం పట్టేడు- వాళ్ల వీధికి రాగానే- యెప్పుడూ లేనిది. వాళ్ల యింటి ప్రక్కాయాన,

'ఏమండీ సూర్యంగారూ- కులాసాగావున్నారా?- ఎక్కణ్ణించిల్లా వస్తున్నారని' పలకరించేడు.

సూర్యానికి- ఆశ్చర్యం వేసింది- ఏమిటి చెప్మా! అనుకొన్నాడు.

'ఆఁ- మీ దయవల్ల- ఏదో అల్లా బజారులోనుండి వస్తున్నా' అన్నాడు.

ఆయన చంకలో యేదో పెద్ద పుస్తకం వుంది. ఏమిటో అది!- కనుక్కోవాలనే కుతూహలం కలిగింది.

'ఏమిటండీ, ఆ చేతిక్రింద- అంత పుస్తకం' అన్నాడు.

'అబ్బే మరేంలేదు- ఇవి లాటరీ టిక్కెట్లు- వీటిని అమ్మటానికి మన వూళ్ళో నన్ను యేజెంటుగా నియమించేరు-టిక్కెట్టెంతో లేదు ఖరీదు- ఓ పావలా మాత్రమే- మొదటి బహుమానం నలభై వేల రూపాయలు- వచ్చేనెల జూలై పదో తేదీన డ్రాయింగు- మీరో టిక్కెట్టు తీసుకుంటారని నమ్ముతున్నాను. ప్రార్థన కూడాను' అని గుక్క తిరగకుండా ఏకరువు పెట్టేడు.

జ్యోతిష్యుడు తనకవ్వాళే చెప్పేడు? లాటరీ మూలంగా డబ్బొస్తుందని!...ఏమో... ఎవరికి తెలుసు. తనకే రాకూడదూ- ఆ నలభై వేలున్నూ...తనకా అదృష్టం వుందేమో! అనుకున్నాడు...

'అవును- సరదాకో టిక్కెట్టు కొనాల్నుంది. ఏదీ వోటికట్టివ్వండి నాకున్నూ...' అని జేబులోంచి పావలా తీసి యిచ్చేడు...

* * *

కమలంకి నాలుగురోజులై వొంట్లో కులాసాగా లేదు. ప్రతిరోజూ ప్రొద్దుట జ్వరం రావటం- సాయంత్రం పోవటం- చాలా నీరసించి పోయింది. అందులోనూ భర్త పెద్ద బియ్యే ప్యాసయినప్పట్కి- ఒక్క చిన్న ఉద్యోగం లేదు కదా అన్న విచారంచేత మరీ కృశించి పోతోంది...

ప్రొద్దుటల్లా తిరిగి- సాయంత్రమైంది సూర్యం ఇల్లు చేరుకున్నాడు- వాడిపోయిన ముఖంతో. కమలాన్ని తదేకంగా చూచేడు.

చాలసేపై భర్తకోసం యెదురు చూస్తూన్న కమలం ఆయాసంతో- ఆతృతతో- గద్గద కంఠంతో- 'వచ్చారూ' అన్నది.

అయ్యో- పాపం- కమలాన్ని యెంత కష్టం పెడుతూన్నాను- పెళ్లి చేసుకొన్న దగ్గరనుంచి- నావల్ల- ఏమైనా సౌఖ్యం అనుభవించిందా- అబ్బా- ఎంత పాపం చేసుకొన్నాను- కమలా! కమలా! నన్ను- నువ్వు- పెళ్లిచేసుకోవడం వల్ల- ఎన్ని కష్టాలనుభవిస్తున్నావు- ఒకప్పుడెంత సుఖంగా కాలం గడిపేదానివి- ఈ పాపిష్టి సూర్యాన్ని యెందుకు చేసుకొన్నావు- కమలా? అబ్బా, నీ ముఖం చూడటానికి ప్రతీరోజూ సిగ్గుగానే వుందిసుమా- అయ్యో- నిన్నిమాత్రం సుఖపెట్ట లేకపోయానే- ఆఖరుకి నీ కొంట్లో బాగా లేదంటే ఆపాటి మందేనా యిప్పించటానికి- శక్తి లేకుండా పోయిందే నాకు!' ఇల్లాగ అనేక విధాల తలపోసేడు- కళ్లమ్మట నీళ్లు గిర్రున తిరిగేయి.

మెల్లగా కమలం ప్రక్క కూర్చున్నాడు మంచంమీద—

అది అద్దె కొంపే- కిటికీలు లేవు- ఒక గది- ఒక వంటిల్లు- అంతే- ఆయింటి సౌభాగ్యం...అల్లాంటి యింట్లో వున్న- పూటకు గతి లేకుండా వున్న- సంసారుల_ ఆస్తి

పాస్తులు ఎవ్వరికీ తెలియనిది!... కాదు...

'కమలా...వంట్లో ఎల్లా వుంది' అని దుఃఖంగా ప్రేమ పూర్వకంగా- గద్గదస్వరంతో అడిగేడు.

'ఒక్క పిసరు నయంగా వుంది- కాని- మీా రిప్పటివరకూ తిరుగుతూనే వున్నారు- ఏ అధికారికీ- ఆపాటి కనికరం మీామీాద లేదా!' అన్నది.

'ఇవి కనికరాలకి రోజులు కావు కమలా...ఎవడి వ్రాత యెలా వుంటే వాడది అనుభవించాల్సింది- ఈ కాలం- గొప్పవాళ్లంతా వకటి, గొప్పవాళ్ళు- మరీ గొప్పవాళ్లవటం, బీదవాళ్లుమరీ బీదవాళ్లవటం- ఇదీ ఈ కాలధర్మం- ఏమని చెప్పేది కమలా' అని కన్నీళ్లు కార్చేడు.

'అబ్బా- మీారిల్లా కళ్లనీళ్లుపెట్టుకోకండీ- నావంట్లో బాధయెక్కువైపోతోంది. వూరుకోండి- మనకీ మంచిదినాలు రాకపోవు, కష్టాలెప్పుడున్నూ కాపురం వుంటాయా.'

జేబురుమాలుకోసం జేబులో చేయి పెట్టంగానే లాటరీ టిక్కెట్టు తగిలింది- ఛప్పున లాటరీ జ్ఞాపకం వచ్చింది. ఆపైన జ్యోతిష్కుడు చెప్పిన సంగతి కూడా జ్ఞాపకం వచ్చింది. తనకు ఓ పెద్ద మొత్తం- సొమ్ము మొత్తం నలభై వేల రూపాయలు రాబోతున్నవి... అప్పుడు కమలాన్ని బాగా సుఖపెట్టవచ్చు- కష్టాలన్నీ గట్టెక్కిపోతాయి...ఏం అదృష్టం...

'కమలా- నిన్ను చాలా కష్ట పెడుతూన్నానుసుమా- మనం యీ కొంప మార్చి, మంచియిల్లు చూసేను- దానికి పోదాం,' అన్నాడు. ఆమె చేతిని ముద్దుపెట్టుకొన్నాడు.

'ప్రియా- యింతకన్నా మన రోజుల్లో చౌకయిల్లు దొరుకుతుందా ఈ యిల్లే- మీా రెక్కడుంటే అ స్థలమే నాకు పెద్ద భవనం...మరో యింటి కెందుకండీ- మన కదృష్టం వున్నప్పుడు మనం వెళ్ల వచ్చు...' అన్నాది కమల.

అదృష్టం! అనేసరికల్లా సూర్యానికి 'కంపస్వేదరోమాంచాదులు' కలుగుతూనై. లోపల సంతోషం కమలాని కప్పటి కప్పుడు తెలియ బరుస్తే యెంత ఆనందంగావుంటుంది ఇప్పట్నుంచి చెప్పటం యెందుకు?

మర్నాడు ప్రొద్దుటేలేచి ఆలోచింపసాగేడు. పెద్ద ప్రయిజువస్తుంది, అప్పుడు కాకుండా యిప్పట్నుంచి యెందుకు కమలాన్ని సుఖపెట్ట కూడదూ- పాపం కమలం జబ్బుతో బాధపడుతూన్నదే.

గభీమని లేచేడు- సేటుదగ్గర నూరు రూపాయలుప్పుతీస్తే?- సేటు తెలిసినవాడు. అప్పిస్తాడు. వడ్డీ పుచ్చుకొంటాడు, ఓ పుచ్చుకోనీ- ప్రయిజు నలభై వేలు- అందులో నూటికి ఏభై రూపాయలు నెలకు వడ్డీవేసి- నూటాయేభై సేటుకిచ్చేస్తే నలభై వేలలో నూటాయేభై యేమూాల!- ఈ ఆలోచన చాలా బాగుంది.

కొయ్యనున్న కోటుతీసి తగిలించుకొన్నాడు.

'కమలా, నే నిప్పుడే వస్తాను- తలుపు చేరవేసుకో-' అని వెళ్లిపోయాడు.

అయితే సేటుఅప్పిస్తాడా...ఎందుకివ్వడూ- ఒక్క నెలలో తీర్చేస్తానంటే యివ్వడూ?...తప్పకుండా యిస్తాడు. ఏవేవో ఆలోచనలలో బజారులోనికి ప్రవేశించాడు- తాపీగా సేటు కొట్టు చేరుకున్నాడు.

'సేటుగారూ...'

'ఒహ్హో- సూర్యంగారూ- ఎన్నాళ్లకు కనబడ్డారూ! ఏం యిలా వచ్చారు."

'అబ్బే యేంలేదు- మీాతో కొంచెం పనుండి—'

'ఏమిపని చెప్పండి- మీాకేమేనా అప్పు కావాల్సిందా'

'అవునండి- అందుకోసమే వచ్చాను.'

'మరేం ఫర్వాలేదు చెప్పండి మీా కెంత కావాలంటే అంతిస్తాను.'

సేటు చాలా మంచివాడు- కాకపోతే అల్లా యెందుకంటాడు?...

'ఓ వందరూపాయిలు సాయం చేస్తే నెలాకరుకి యేభై రూపాయల

వడ్డీతో నూటయేభై తీర్చేస్తాను'

సేటుకు ఆశకలిగింది, వంద రూపాయలిచ్చి సూర్యం చేత సంతకం చేయించుకొన్నాడు.

సూర్య మప్పుడు గొప్ప అదృష్ట వంతుడై పోయాడనుకొన్నాడు. గబగబా యింటి యజమాని దగ్గర వెళ్లి వానితో జట్టీ తెచ్చేడు.

'ఈ వెధవకొంపలోకి గాలిరాదు యేం లేదు. యెవ్వరుండగలరండీ అందులోను?-'

'పోనీ లెండి యెవరికి కావలిస్తే వాళ్లే వుంటారు-యిన్నాళ్ళూ మీరే వున్నారు కదూ'

'నే నిప్పుడే ఖాళీచేసేస్తున్నాడు.'

'పోనీ- అల్లానే కానీండి బాబూ- మీ రెల్లాగంటే అల్లాగే...'

అప్పటికైన అద్దె చెల్లించి యింటికి వచ్చాడు సూర్యం.

'కమలం- మన కష్టాలీ నాటికి గట్టెక్కాయి- మనం యిప్పుడే యిల్లు మార్చేయాలి...' అని ఆమెను కౌగలించుకొని ముద్దుపెట్టుకొన్నాడు.

భర్త వాలకం చూస్తే ఆమె కేమీ బోధపడటం లేదు.

'అదే మల్లా అంటున్నారు, అదృష్టం యేమిటి' అని ఆతృతతో అన్నది.

'అదంతా తర్వాత చేప్తాలే- ముందు పద- మంచి మేడయిల్లు అద్దెకు మాట్లాడేను, మనం మరిందులో వుండలేం- ఇప్పుడే మార్చేద్దాం!

ఎంతకేనా భర్త, అతనికి తెలియనిది తనకేం తెలుసు, అందులోనూ కమలానికి సూర్య మెంతంటే- అంత!...

ఆ క్షణమే యిల్లు మార్చేసేరాదంపతులు-

* * *

కమలానికి ట్రీట్మెంటుయివ్వటానికి వో డాక్టరుని నియమించేడు సూర్యం. ఆహారానికి బత్తానారింజ పళ్ళు ద్రాక్షపళ్ళు-సోడాలు- మొదలైనవి తెచ్చేడు- తన జీవితంలో హాయిగా గడపటానికివే మొదటి రోజులు కమలానికి

సూర్యం బజారు కెళ్లి అదే షరతులమీద లాల్దాసు దగ్గరకెళ్ళి నూరు రూపాయలు అప్పుచేసేడు. ఇంటికి వస్తూన్నప్పుడు క్రొత్తరకాల వాయులు చీరలు బాడీలు అరడజను కొన్నాడు కమలం కోసం. చాలా మట్టుకు ఇంట్లో ఫర్నిచరు కొన్నాడు. తనకోసం నాల్గుసూట్లు కుట్టించుకొన్నాడు.

కమలానికిదంతా చూస్తే యేమీ పాలుపోకుండా వుంది. భర్తకి వుద్యోగం యెక్కడేనా అయిందా? అలా అయితే తనకు చెప్పడూ- పోనీ-యింకా చెప్తాడేమో- వూరుకొన్నది కమలం...

'కమలా- నీకిప్పుడు కులాసాగా వుందా'

'మీరున్నచోటల్లా నాకూ కులాసాగానే వుంటుంది. కాని మీరింత వైభవం జరపటానికి కారణం చెప్పేరు కారు కదూ' అని ప్రేమపూర్వకంగా అన్నది.

ఆమెనుతీసి వొళ్ళో కూర్చోపెట్టుకొని గట్టిగా కౌగలించుకొని ముద్దులు గురిపించేడు.

'నీతో చెప్పేనుకదూ మన కష్టదినాలు పోయాయని...' అన్నాడు.

వుద్యోగం దొరికిందని చెప్పటానికిల్లా చెప్పే డనుకొని సరదా పడ్డది కమలం పాపం!

కమలంతో లాటరీసంగతి చెప్పటమా మానటమా చెప్తే యేమంటుందో- చెప్పాల్సుంది-పోనీ- లాటరీలు- జ్యోతిష్కులు వాళ్లగురించి కమలం అభిప్రాయమే యేమో చూద్దామని యిలా దిగేడు కార్యక్రమానికి.

'కమలా- నీకు- జ్యోతిష్యం, చేయి చూపించి చెప్పించుకోటంలో యేమేనా నమ్మకముందా? నాకే మీ నమ్మకం లేదు సుమా' అన్నాడు...'

'జ్యోతిష్కులా! వాళ్లువట్టిదగాకోర్లు సుమండీ- వాళ్లని- ఆ వెధవల్ని నమ్మకూడదు- ఓమారు మా పెత్తండ్రి కొడుకు జోశ్యం చెప్పించుకొంటే ఆ వెధవ 'యింకా

నువ్వు అరవైయేళ్ళు బ్రతుకుతావని చెప్పేడు- పాపం- వాడు నెల కాకముందే పోయాడు. మీకు తెలీదూ. రామం- వాడే' అన్నది-

సూర్యం గుండెల్లో రైళ్ళు పరుగులెట్టేయి- ఏమిటీ- జ్యోతిష్యులందరూ దగాకోరులా! ధనాశాపరులా? అయితే తనకు చెప్పినదంతా అబద్ధమే...?

'మీ రెప్పుడూ జ్యోతిష్యులని నమ్మకండిమీ- వాళ్లు వట్టి దగాకోరులు- డబ్బుకోసం యెత్తు... యెప్పుడూ నమ్మకూడదు...'

'పోనీ లాటరీ టిక్కెట్లో- నాకో టిక్కెట్టు కొనాలనుంది'- అన్నాడు

'ఛీ ఛీ- ఇంకా నన్నడిగేరు కొనేకుండా- శుష్క దండుగసుమండీ- లాటరీ అంతా- ఎందరో కోటానుకోట్లు కట్తారు. లాటరీ అందులో మనమేమూల?- అల్లా యెప్పుడూ లాటరీ కట్టరుకదూ- లేక కట్టేశారా?'

'అ:హా, అబ్బెబ్బే- కట్టలేదు కమలా- లాటరీలంటే నాకిష్టమే లేదు-' అని చప్పున లేచేడు కోటు వేసుకొన్నాడు.

'ఎక్కడికా తొందర' అన్నది కమలం.

'కమలా! యెక్కడికీలేదు. ఇప్పుడే వస్తానని బయలునేదేడు.

అయితే కమలం అన్నది నిజమే- ఇంక తన బ్రతుకేంకాను- నలభై వేలొస్తాయనే నమ్మకంతోనే కదూ 200 అప్పుచేసేడు!- సేటు- లాల్దాసు- వీళ్ళిద్దరూ యమకింకరుల్లా కళ్ళకు కనబడ్డారు. ఇంక తన బ్రతుకు దుర్భరం; ఏమిచేయటం!- నిజమే కోట్లకొద్దీ వున్న లాటరీ టిక్కెట్లలో తనదేమూల? యెంత పొరపాటు పని చేసేను- ఇప్పుడెల్లాగ! యేదిమార్గం ...ఆఁ-ఆఁ...అంతమందిలో జ్యోతిష్యుడు చెప్పేడుకదూ-తన కదృష్టం వుందని-తనకే రాకూడదా-ఆనలభై వేలున్ను; ఇలా ఎన్నోవిధాల ఆలోచిస్తూ మునపటి మర్రిచెట్టు దగ్గర కొచ్చేడు. అక్కడ మరెవరెవరో వున్నారుగాని జ్యోతిష్యుడులేడు!— దగా చేశాడా?

'ఏమండీ మీరూ ఆజ్యోతిష్యుడు కోసమేగా చూస్తున్నారు-ఇప్పుడు కనబడ్తే అమాంతంగా ఒక్క లెంపకాయ లాగేద్దును; చూడండి ఒక కేసులో ఆస్తంతా నాకే వస్తుందని చెప్పేడు ఆస్తి మాఅన్నకి పోయింది. మీదుమిక్కిలి నా దగ్గ రేడు రూపాయలు దోచేడు-' అని యెవరో సూర్యంతో అంటూ వెళ్లిపోయాడు-

అయ్యో జ్యోతిష్యుడెంత దగా మనిషి—ఇల్లా గెంతమంది దగా అయిపోతున్నారో కదా! ఆ వెధవన్నర వెధవ యెంత డబ్బార్జిస్తున్నాడిల్లాగ మోసంచేస్తూ!

సరే- ఇప్పుడు తన బ్రతుకేంగాను- వాడుచెప్పింది సుద్ధఅబద్ధం- తప్పకుండాను- అయ్యో- ఇప్పుడేం చెయ్యాలి- లాల్దాసు- సేటు- అమ్మో- రెండువందలు- కాదు వడ్డీ వంద- మొత్తం మూడువందలు- తను మరి బ్రతకలేడు- ఇప్పుడేం చెయ్యడం?......

గబగబా పోస్టాఫీసు కెళ్ళేడు- తన మామగారి కిల్లా టెలిగ్రామిచ్చేడు.

కమలకి- జబ్బుగావుంది. వెంటనే రావాలి.'

ఈ టెలిగ్రాం ఇంకో గంటకు మామగారికి అందిపోతుంది. మామగారు తప్పకుండా వస్తారు, కమల హాయిగ తండ్రి దగ్గరవుంటుంది, అనుకొన్నాడు, చేంతాడు ఒకటి కొన్నాడు తన పనికోసరం.

ఇంటికి వచ్చాడు, ఛప్పునజ్ఞాపకం వచ్చింది. ఆనాడు ఏదో తేదీ అని ఆనాడే టిక్కెట్లు తీస్తారు. తనకు బహుమతీవస్తే టెలిగ్రా)మిస్తారు. సాయంత్రం $6\frac{1}{2}$ అయింది. టెలిగ్రాం లేదు. సరే తన లాటరీ పోయిందనుకొన్నాడు-ఇంక పూర్తి నిశ్చయం-

* * *

ఎనిమిదోగంట రైలులో మామగారొచ్చారు-సాయంత్రం బజారు వెళ్ళేరనిన్నీ ఇంకో నిమిషంలో తనొస్తారనిన్నీ చెప్పింది కమలం ఆయాసంతో.

ఇంతలో ఎర్రసైకిలుమీద పోస్టు జవాను వచ్చి టెలిగ్రామిచ్చేడు. ఆత్రుతతో మామగారు చూసేరు. అందులో ఇలా వుంది:

'మాస్టరు సూర్యం- ఫస్టు ప్రైయిజు- నలభైవేలు గ్రీటింగ్సు-' అని-

ఇంక కమలం సంతోషానికి మేరలేదు.


ఎంతరాత్రయినా సూర్యం రాలేదు- ఇంతలో కమలం వేణ్ణీళ్లు పెట్టడానికి మెల్లగా వంటింట్లో కెళ్లింది- తలుపుతీసింది.

కెవ్వుమని పెద్దకేక వేసి గుభేలున గుమ్మంలో పడిపోయింది-

'కమలా- కమలా- ఏమయిందమ్మా' ఏమయింది- ఏమికావాలో అదే అయింది- క్రింద కమల కళేబరం- వంటిట్లో- దూలానికిన్నీ సూర్యం పీకకిన్నీ చేంతాడులంకె...

గాలిలో వూగుతోంది సూర్యం కళేబరం!...


# అయఃకాంత ద్రావకం



ధాతువృద్ధికి సేవింపదగినది ద్రావకము ఇనుము. ఇనుము తిన్నవారికి నీరసము, ముసలితనము లేదని అగస్త్యాదులు వచించియున్నారు. కావున దీనిని సేవించుటచే భీమబలము సిద్ధించును.

ద్రావక సేవనమువలన గలుగు గుణములు.

ఉష్ణముచే వెంట్రుకలు రాలకుండ ఆగును, కాలుచేతులు, కండ్లమంటలు పోవును, ముఖమునకు తేజస్సు నిచ్చును, వాతమును, ఉష్టమును పోగొట్టును, కాళ్ళు చేతుల దుర్బలము నణచి నొప్పును పోగొట్టును ఆకలిని జీర్ణశక్తిని కలిగించును. సడలిన నరములకు సత్తువ జేయును గుల్మము, గుండెనొప్పి కలవారు ఈ అయఃకాంత ద్రావకమును 8 రోజులు సేవించినచే జాలును ధాతుపుష్టి లేని వారు 40 రోజులు సేవించిన జాలును.

(అర్ధ మండలం) 20 రోజులకు మందు 1-0-0.

(1 మండలం) 40 రోజులకు వచ్చుమందు 1-12-0.

## ఆర్యా బుక్ డిపో,

తిరువళ్ళిక్కేణి, మదరాసు.